సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



ఆపరేషన్ పరికరాల పంపిణీ
పాడేరు రూరల్ : శస్త్ర చికిత్సల పరికరాలను కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ప్రారంభించి పంపిణీ చేశారు.



వ్యక్తి దారుణ హత్య
మండలంలోని కితలంగి పంచాయతీ వయ్యా గ్రామంలో భూతగదా నేపథ్యంలో వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. 8లో



ప్రశాంతంగా పది పరీక్షలు
టెన్త్ పరీక్షలు తొలిరోజు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 63 పరీక్ష కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. 8లో

న్యూస్‌రీల్

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతూరు: స్థానిక కేజీబీవీ పాఠశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని ఎంఈవో లక్ష్మీనారాయణ సోమవారం తెలిపారు. 6,7,8,9 తరగతులతో పాటు ఇంటర్ సీఈసీ గ్రూపులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆరో తరగతిలో 40, ఇంటర్‌లో 40 ఖాళీలున్నాయన్నారు. ఈనెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు కోసం ఆధార్, తల్లిదండ్రుల చిరునామా, ఐదో తరగతి పాఠశాల పేరు, ఫోన్ నెంబర్లు, శాస్వత చిరునామా, వృత్తి, రేషన్‌కార్డు నంబరు, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటోలు జతచేయాలని ఆయన సూచించారు. ఏపీ కేజీబీవీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న పీవో, ఇతర అధికారులు

చింతూరు: స్థానిక ఐటీడీఏ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. చింతూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 7, కూనవరం ప్రాజెక్టు పరిధిలో 5 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారు. చింతూరు ప్రాజెక్టు పరిధిలోని 7 పోస్టులకు 21 దరఖాస్తులు రాగా 17 మంది, కూనవరం ప్రాజెక్టు పరిధిలో 5 పోస్టులకు 14 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. మెరిట్ ఆధారంగా త్వరలోనే భర్తీ చేయనున్నట్లు పీవో తెలిపారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, చింతూరు సీడీపీవో విజయగౌరి, కూనవరం సీడీపీవో విమల పాల్గొన్నారు.



ఇంటర్వ్యూ చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్

పాడేరు రూరల్ : పాడేరు డివిజన్‌లో అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ అభిషేక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. నాలుగు అంగన్‌వాడీ, 22 హెల్పర్, 12 మినీ అంగన్‌వాడీ పోస్టులకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 90 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

హరిత రిసార్ట్స్‌లో 'వన్ వే' సందడి



హరిత రిసార్ట్స్‌లో చిత్ర యూనిట్ సభ్యులు

అనంతగిరి: స్థానిక హరిత రిసార్ట్స్ వద్ద షూటింగ్ సందడి నెలకొంది. పాకలపాటి వీస్ వర్మ, చైతన్య జంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జాతీయ, అంతర్జాతీయ అవార్డు గ్రహీత సురంజన్ దే దర్శకత్వం వహిస్తున్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్‌కు యువత ఆకర్షితులై జీవితాలు ఎలా నాశనం చేసుకుంటున్నరనే కథాంశంపై హిందీ, తెలుగు భాషల్లో 'వన్ వే' పేరుతో సినిమా చిత్రీకరిస్తున్నామని నిర్మాతలు తెలిపారు. ఇప్పటివరకు అరకు, అనంతగిరి, పరిసర ప్రాంతాల్లో 80 శాతం షూటింగ్ పూర్తయిందని వివరించారు. నేపాల్, ఊటీలో తదుపరి షెడ్యూల్ ఉంటుందని వారు వివరించారు. సినిమాకు డీవోపీగా జీవీ ప్రశాంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు.

కళ తప్పిన మత్స్యగెడ్డ



కుమ్మరిపుట్టు వద్ద అడుగంటిన మత్స్యగెడ్డ

ముంచంగిపుట్టు: నిత్యం నీటితో కళకళలాడే మత్స్యగెడ్డ ఎండ తీవ్రతకు అడుగంటుతోంది. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరు అందించే జోలాపుట్టు జలాశయం మత్స్యగెడ్డ నీరే ప్రధాన ఆధారం. ప్రస్తుతం ఎండ తీవ్రతకు కళ తప్పింది. సుజనకోట, పెదగూడ, దార్రెల, పనసపుట్టు, దొడిపుట్టు పంచాయితీ మీదుగా ప్రవహించే మత్స్యగెడ్డ పరిస్థితి ఏప్రిల్‌లోనే ఇలా ఉందంటే రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. దీనివల్ల మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీటి గండం ఉండే అవకాశాలు లేకపోలేదు.

గిరి సీమలో.. పాలనా వికాసం

- కొత్త జిల్లా ఏర్పాటుతో చేరువైన ప్రగతి ఫలాలు
- సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్న అధికారులు
- నెరవేరుతున్న ప్రభుత్వ లక్ష్యం
- అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడి నేటికి ఏడాది పూర్తి

పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పాటుతో గిరిజనుల ముంగిటకే పాలన వచ్చింది. వారికి ఏ కష్టమొచ్చినా అధికార యంత్రాంగం వారి చెంతనే ఉంటూ బాసటగా నిలుస్తోంది. గతంలో ఏసమస్య ప్రభుత్వానికి తెలియజేయాలన్నా విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేది. కొత్త జిల్లా ఏర్పాటుతో ప్రభుత్వమే వారి చెంతకు పాలన తెచ్చింది.

సాక్షి,పాడేరు: అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజనులకు కొత్త జిల్లా ఏర్పాటుతో పాలన చేరువైంది. పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా స్వాతంత్ర్య పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు పేరిట పాడేరు కేంద్రంగా జిల్లా ఏర్పడి మంగళవారం నాటికి ఏడాది పూర్తయ్యింది. గిరిజనుల పక్షపాతిగా పేరొందిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 22 మండలాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికపరంగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి.

గిరిజనుల మధ్యే కలెక్టర్

కలెక్టర్ సుమిత్‌కుమార్ గిరిజనులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. వారి సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తున్నారు. నెలలో 10 రోజుల పాటు చింతూరు, రంపచోడవరం డివిజన్‌ల పరిధిలో మకాం వేస్తున్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. స్పందన పిర్యాదులపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమం ఫలాలను ఎప్పటికప్పుడు గిరిజనులకు అందేలా చర్యలు చేపడుతున్నారు.

- కొత్త జిల్లాగా ఏర్పాటుకానప్పుడు జిల్లా అధికారుల దృష్టికి ఏ సమస్య తీసుకువెళ్లాలన్న విశాఖ వెళ్లాల్సి వచ్చేది. దూరాభారం కావడంతో ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు కొత్త జిల్లాగా ఆవిర్భవించడంతో గిరిజనులకు అవస్థలు తప్పాయి.

అందుబాటులోకి వచ్చిన ఉన్నత వైద్యం

జిల్లా ఏర్పడిన తరువాత ప్రభుత్వం గిరిజనులకు ఉన్నత వైద్యంపైనే అధికంగా ప్రభుత్వం దృష్టి పెట్టింది.జిల్లాలోని అన్ని వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల్లో వైద్యనిపుణుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. శస్త్ర చికిత్సలు అందుబాటులోకి తెచ్చింది.

- జిల్లా నుంచి విజయనగరం, విశాఖ కేజీహెచ్, కాకినాడ జీజీహెచ్, పెద్దాసుపత్రులకు రిఫరల్ కేసులు తగ్గాయి.
- పాడేరు జిల్లా ఆస్పత్రిలో అన్ని విభాగాలకు సంబంధించి ఉన్నత శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. కేజీహెచ్‌కు తరలించే బాధలు తప్పడంతో మన్యం ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చింతూరు, రంపచోడవరం ఏరియా ఆస్పత్రుల లోను శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. పాడేరు జిల్లా ఆస్పత్రిలో ఈఏడాది కాలంలో 2131 శస్త్రచికిత్సలు జరిగాయి. వీటిలో జనరల్ సర్జరీలు 983, ఆర్థోపెడిక్ 92, గైనిక్ 586, కంటి సంబంధించినవి 417, ఈఎన్‌టీ 53 ఉన్నాయి.
- జిల్లాలో సికిల్‌సెల్, తలసీమియా కేసులపై అప్రమత్తమైన ప్రభుత్వం పాడేరు జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ రెండు నెలల్లో 298 మంది అనుమానిత చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరిలో 15 మందికి సికిల్‌సెల్ ఎనీమియా ఉన్నట్టుగా గుర్తించి మెరుగైన వైద్యసేవలు, పౌష్టికాహారం అందిస్తున్నారు. గతంలో కేజీహెచ్‌లో ఇలాంటి పరీక్షలు, వైద్యానికి రోగులు నరకయాతన పడేవారు. ఇప్పుడు వారికి కష్టాలు దూరమయ్యాయి.
- అంగన్‌వాడీ వ్యవస్థ బలోపేతమైంది. ఖాళీ పోస్టులను భర్తీ చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం లక్ష్యంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్‌ను విజయవంతంగా అమలు జేస్తున్నారు. ఆస్పత్రిల్లో ప్రసవాలకు ప్రాధాన్యం పెరిగింది.
- అన్ని గ్రామాల్లోను తాగునీటి సమస్య పరిష్కారానికి జల్‌జీవన్ మిషన్ ద్వారా పెద్ద ఎత్తున పనులు జరుగుతున్నాయి.
- జిల్లాలోని కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగు పరిచేందుకు 1890 సెల్‌టవర్లు మంజూరయ్యాయి. ఇటీవల 75 టవర్లు పూర్తికాగా, 250 టవర్లు నిర్మాణ దశలో ఉన్నాయి, మరో 1200 టవర్లకు రెవెన్యూశాఖ స్థలాలను కేటాయించింది.
- పీఎంజీఎస్‌వై, బీసీపీ, ఎస్‌సీపీ తదితర ప్రాజెక్టుల కింద మారుమూల గ్రామాలకు పక్కా రోడ్లు, గెడ్డలపై వంతెన నిర్మాణ పనులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.
- పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా 967 పాఠశాలలో నాడు–నేడులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి
- వ్యవసాయానికి సంబంధించి గత ఖరీఫ్‌లో 90 శాతం రాయితీపై వరివిత్తనాలు,రబీలో 90శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేసింది.
- గంజాయి సాగుకు ప్రత్యామ్నాయంగా మారుమూల గ్రామాలలో ఉద్యానవన,వాణిజ్య,వ్యవసాయ పంటల సాగుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంది
- అన్నిశాఖల పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయి.



మావోయిస్టు ప్రభావిత బూసిపుట్టు సంతలో వైద్యసిబ్బందితో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



వర్షంలో తడుస్తూ కొయ్యూరు మండలం వెలగపాలెం పంచాయతీ కిత్తాబు గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, అరకు ఎంపీ మాధవి (ఫైల్)

ప్రభుత్వ లక్ష్యసాధనకు కృషి



ప్రభుత్వ లక్ష్యసాధనకు సాయశక్తులా కృషి చేస్తున్నా. గిరిజనులంటే ఎంతో ఇష్టం. ఏజెన్సీ ప్రాంతంలో పని చేసే అవకాశం రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా. ఏడాది పాలన ఎంతో సంతృప్తినిచ్చింది. మారుమూల గ్రామాలకు రోడ్లు, కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపై దృష్టి సారించా. పాడేరు జిల్లా ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు అందుబాటులోకి తెచ్చాం. గిరిజనుల సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమం ఎంతో దోహదపడుతోంది. క్షేత్రస్థాయిలో పర్యటన నమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయోగపడుతోంది.

– సుమిత్‌కుమార్, కలెక్టర్

వరదల్లో ఎనలేని సేవలు



బాధితులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి (ఫైల్)

చింతూరు: గోదావరి వరదల సమయంలో ఎన లేని సేవలు అందాయి. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాకలను అతలాకుతలం చేశాయి. 1986 అనంతరం అదే స్థాయిలో గోదావరికి భారీ వరద నమోదు కావడంతో నాలుగు మండలాల్లో 200 గ్రామాలు ముంపునకు గురవడంతో 43 వేల కుటుంబాలపై ప్రభావితం చూపింది. స్థానిక ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బాధితులకు అందుబాటులో ఉంటూ సహాయక కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ సహకారం వెంటనే అందేలా చర్యలు తీసుకున్నారు.

బాధితులకు బాసట

వరదలతో నిరాశ్రయులైన ప్రజలకు ప్రభుత్వం బాసటగా నిలిచింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. వరదల సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వం జిల్లా అధికారులను అప్రమత్తం చేసింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లా కేంద్రమైన పాడేరు నుంచి చింతూరుకు మకాం మార్చారు. ఐటీడీఏ కేంద్రంగా వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. పునరావాస కేంద్రాలకు తరలించి నిత్యావసరాలు, ప్రభుత్వం సాయం ఎప్పటికప్పుడు అందించారు. ప్రత్యేకాధికారిగా కార్తికేయ మిశ్రాను నియమించిన ప్రభుత్వం వరదలను ఎదుర్కొనేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసింది. ఆయనతోపాటు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ సతీష్‌కుమార్‌కు తోడు పోలవరం అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్‌ఆదిత్య, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే, పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్, చింతూరు ఐటీడీఏ పీవో రామశేషు, రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ అభిషిక్త్ కిషోర్, బద్వేల్ ఆర్డీవో ఆకుల వెంకటరమణ తదితరులు వరదలను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు.

ముఖ్యమంత్రి బాసట

వరదలకు అతలాకుతలమైన చింతూరు మండలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించి బాధితులకు బాసటగా నిలిచారు. అప్పటికే ముంపు బారిన పడిన కుటుంబాలతో పాటు వరద కారణంగా రహదారి సౌకర్యం నిలిచిపోయిన గ్రామాల్లో కుటుంబాలకు రూ.2 వేల చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందించింది.



వరద ప్రాంతాల పరిశీలనకు బోటుపై వెళుతున్న అధికారులు

కొత్త జిల్లా అయినా సమన్వయంతో వరదలను సమర్థవంతంగా ఎదుర్కొన్న అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఇదే సమయంలో చింతూరు కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి వెంటనే కార్యరూపం దాల్చేలా చర్యలు చేపట్టారు.

శ్రీరామగిరి.. రామమయం



విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్న ఆలయం

- వైభవంగా స్వామివారి తెప్పోత్సవం
- ఆకట్టుకున్న దొంగల దోపోత్సవం
- భక్తులతో కిటకిలాడిన ఏజెన్సీ భద్రాద్రి
- విద్యుత్‌దీప కాంతులతో మెరిసిపోయిన ఆలయం

వీఆర్‌పురం: ఏజెన్సీ భద్రాద్రి శ్రీరామగిరి శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. నవమి ఉత్సవాల్లో భాగంగా శ్రీసుందర సీతారామచంద్ర స్వామివారికి పావన గోదావరినదిలో వైభవంగా తెప్పోత్సవం, దొంగలదోపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము 1.00 గంటలకు ఆలయ కమిటీ చైర్మన్ రేవు బాలరాజు ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు నిర్వహించారు. కొండ మీద ఆలయంలో స్వామివారికి ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం జరిపించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులను అలంకరించారు. దేవరాజ వాహనంపై కొండమీద నుంచి దిగువకు తీసుకువచ్చి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం గోదావరి నదికి తోడ్కొని వెళ్లారు. తెప్పోత్సవానికి తగిన నీరు నదిలో లేకపోవడంతో అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవరులను కల్యాణ మండపానికి తీసుకువచ్చి దొంగల దోపోత్సవం నిర్వహించారు. ఓ దేవకన్య శాప విముక్తికి సంబంధించి కథే దొంగల దోపోత్సవ ఇతివృత్తమని సౌమిత్రి పురుషోత్తమాచార్యులు భక్తులకు విశదీకరించారు. అనంతరం స్వామివారిని కొండ మీద ఆలయానికి తరలించారు. ఉదయం వసంతోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవ వేడుకలను వీక్షించేందుకు వీఆర్‌పురం మండలంతో పాటుగా కూనవరం, చింతూరు, వెలేరుపాడు తదితర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎటపాక సీఐ గంజేంద్ర ఆధ్వర్యంలో ఎస్ఐలు తెల్లం,దుర్గాప్రసాద్,బి.వెంకటేష్ ,పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



స్వామివారికి దొంగలదోపు ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



తెప్పోత్సవానికి స్వామివారిని నది వద్దకు తీసుకువెళ్తున్న అర్చకులు



తెప్పోత్సవంలో భాగంగా గోదావరి మాతకు హారతి ఇస్తున్న అర్చకులు

ఆపదలో అండగా..

- నిండు గర్భిణి ఆస్పత్రికి తరలింపు
- వాహనం సమకూర్చిన మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

హుకుంపేట: ప్రసవ వేదనతో బాధపడుతున్న నిండు గర్భిణిని మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సకాలంలో ఆస్పత్రికి తరలించి ఆపదలో అండగా నిలిచారు. సోమవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలావున్నాయి. మండలంలోని బాకూరు బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన నిండు గర్భిణి చీకటి వనిత పురిటి నొప్పులతో బాధపడుతోంది. వెంటనే కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అయితే స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో సమస్యను గుర్తించిన మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు స్పందించారు. సంస్థకు చెందిన ఆటోలో ఆమె ఉప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



ముఖ్యమంత్రితో జిల్లా ఎమ్మెల్యేలు

రాజధానిలో జరిగిన వైఎస్సార్‌సీపీ సమావేశానికి జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరతోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ, ధనలక్ష్మి కలిశారు.

టెన్త్ పరీక్షలకుహెల్ప్ డెస్క్

సాక్షి,పాడేరు: జిల్లాలోని 63 పరీక్ష కేంద్రాల ద్వారా జరుగుతున్న టెన్త్ పరీక్షలకు గాను పాడేరులోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని డీఈవో సలీమ్‌బాషా సోమవారం తెలిపారు. పరీక్షలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా, ఇతర సమాచారం, వివరాలకు హెల్ప్ డెస్క్‌లోని 8688177011,9492394348 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రతీ కుటుంబానికి వందరోజుల ఉపాధి

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు

సాక్షి, పాడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను అధిగమించాలని, జాబ్ కార్డు కలిగిన ప్రతీ గిరిజన కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఉపాధి హామీ ఏపీవోలు, ఇంజినీరింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఉపాధి హామీ పనులు, డి.ఫారం పట్టాలు పంపిణీ, మన బడి, నాడు నేడు పనుల పురోగతి, భూములు రీసర్వే, పన్నుల వసూళ్లు, ఆధార్ నవీకరణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్,మే,జూన్ నెలలో ఉపాధి హామీ పనులు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. జాబ్ కార్డు పొందిన గిరిజన కుటుంబానికి రూ.25 వేల వరకు వేతనం అందితే వచ్చే ఖరీఫ్ కాలంలో వ్యవసాయ పనులకు ఉపయోగపడుతుందన్నారు. గతంలో పనులు జరగని గిరిజన గ్రామాల పరిధిలో ఉపాధి పనులు చేపట్టాలని సూచించారు. నూరు శాతం పనులు కల్పించే విధంగా పనులు ముందుగా గుర్తించి ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఉపాధి హామీ కార్డులకు ఆధార్‌తో పాటు, బ్యాంకు ఖాతాలకు అనుసంధానం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇంటి పన్నులతో పాటు ఆధార్ నమోదు ప్రక్రియ వేగవంతంచేయాలని ఆయన సూచించారు.

నిధుల దుర్వినియోగం జరిగితే చర్యలు

మనబడి, నాడు నేడు పనుల్లో పటిష్టమైన నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యం పనులు పక్కాగా చేయాలని చెప్పారు. విద్యుత్ పరికరాలు, తాగునీటి పైపులు, నిర్మాణ సామగ్రిలో నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని, నాసిరకం వస్తువులు కొనుగోలు చేసి నిధులు దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాడు–నేడు పనులకు మండలాల వారీగా కేటాయించిన నిధుల వివరాలను తెలియజేశారు.

డిఫారం పట్టాల పంపిణీకి చర్యలు: గిరిజన రైతులకు డి ఫారం పట్టాలు పంపిణీకి తహసీల్దార్లు చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డి.పట్టా భూములను గుర్తించి ఎస్సైన్‌మెంట్ కమిటీ దృష్టికి తీసుకువెళ్లి డి పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. భూములు సర్వే చేసి సబ్‌డివిజన్ చేయాలని ఆదేశించారు. ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం తగదన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

వేసవిలో ఆరోగ్యం జాగ్రత్త

ఈనెల 1వ తేదీన కలెక్టరేట్‌లో నిర్వహించిన వైద్య శిబిరంలో 340 మంది ఉద్యోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారని కలెక్టర్ తెలిపారు.ఈవిధంగానే మండల కేంద్రాలు,పీహెచ్‌సీ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహించాలని చెప్పారు. ఎక్కువ మంది ఉద్యోగులు షుగర్, బీపీలతో బాధపడుతున్నారని, వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యపరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాస్, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అషితోష్ శ్రీవాత్సవ, డీఆర్వో అంబేద్కర్, సర్వే సహాయ సంచాలకులు వై.మోహనరావు, డ్వామా పీడీ రమేష్ రామన్, డీపీవో కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్, ఏపీడీ జె.గిరిబాబు, పీఎంయూ ప్రోగ్రాంఅధికారి రాంగోపాల్, 22మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రామకృష్ణారావు

మాకవరపాలెం: లారీ ఢీకొట్టడంతో మోటారు సైకిల్‌పై వెళ్తున్న యువకుడు మృతి చెందాడు. కశింకోట మండలం తాళ్లపాలెంకు చెందిన మేరపురెడ్డి సన్యాసిరావు(37) సోమవారం మాకవరపాలెం వైపు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో వెంకన్నపాలెం గ్రామ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్‌ఐ రామకృష్ణారావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు



పాడేరు ఉన్నత పాఠశాల సెంటర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు



పాడేరు కేజీబీవీ టెన్త్ విద్యార్థినులకు బెస్ట్ ఆఫ్ లక్ చెబుతున్న 9వతరగతి విద్యార్థినులు

- 63 పరీక్ష కేంద్రాల్లో నిర్వహణ

సాక్షి, పాడేరు: పదవ తరగతి పరీక్షలు తొలిరోజు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో 63 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యాశాఖ అన్ని సౌకర్యాలను టెన్త్ విద్యార్థులకు అందుబాటులో ఉంచింది.ఆర్టీసీ బస్సు సేవలను కల్పించింది. ఉదయం తొమ్మిది గంటలకే అన్ని పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసుసిబ్బంది విద్యార్థులను తనిఖీ చేసిన తరువాతే లోపలకు పంపారు. తొలి పరీక్ష తెలుగుకు 11,053మంది విద్యార్థులు హాల్‌టికెట్లు పొందగా,10,938 మంది పరీక్ష రాశారు. మిగిలిన 105 మంది గైర్హాజరయ్యారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా గట్టి నిఘా ఏర్పాటుచేశారు. డీఈవో సలీంబాషా, పాడేరు గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ పరిధిలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.



బస్సులో పాడేరు పరీక్షా కేంద్రానికి వస్తున్న టెన్త్ విద్యార్థినులు

తెలుగుకు బదులుగా ఉర్దూ, హిందీ ప్రశ్నపత్రాలు

- సమస్య ఎదుర్కొన్న ఇద్దరు విద్యార్థులు

రాజవొమ్మంగి : మండలకేంద్రం రాజవొమ్మంగిలోని రెండు పది పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు సోమవారం విచిత్ర పరిస్థితి నెలకొంది. దీంతో ఇద్దరు విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. వివరాలిలా వున్నాయి. స్థానిక గిరిజనసంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న మజ్జి నూకరత్నానికి తెలుగు ప్రశ్నాపత్రంకు బదులు హిందీ పేపరు వచ్చింది. దీంతో ఆ బాలిక అవాక్కయ్యి విషయాన్ని సీఎస్, డీవోల దృష్టికి తీసుకు వెళ్లింది. హాల్‌టికెట్‌లో హిందీ అని ఉందని, దాంతో నీవు ఆ పేపరే రాయాలని వారు అన్నారని నూకరత్నం తెలిపింది. చేసేది ఏమీ లేక బాధతో హిందీలోనే పేపర్ పూర్తి చేశానని ఆమె తెలిపింది. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా ఇదే తరహాలో ఘటన చోటుచేసుకుంది. నాగులపల్లి అంజిబాబు అనే విద్యార్థికి తెలుగు పేపరుకు బదులు ఉర్దు ప్రశ్నాపత్రం వచ్చింది. అయితే అక్కడ విధుల్లో ఉన్న సీఎస్, డీవో, ఇన్విజిలేటర్లు ఉర్దూ ప్రశ్నాపత్రాన్ని వెనక్కి తీసుకొని ఆ విద్యార్థితో తెలుగు పేపరు రాయించారు. ఈ ఇరువురు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వారే కావడం గమనార్హం. కాగా ఆ పాఠశాలకు చెందిన హెచ్‌ఎం పి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు విద్యార్థుల యొక్క పరీక్షల నామినల్ రోల్‌ను (ఎన్ఆర్‌ను), ఉన్నతాధికారులకు పంపినప్పుడు పర్యవేక్షించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్న విమర్శలున్నాయి. విద్యార్థిని నూకరత్నం ఆరో తేదీన రాయాల్సిన హిందీ పరీక్షకు బదులుగా తెలుగు అని ఉండటంతో గందరగోళ పరిస్థితి నెలకొంది.



తెలుగుకు బదులుగా హిందీ పరీక్ష రాయించారని కన్నీటితో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న నూకరత్నం

రూ.16.15 లక్షల పింఛన్ల సొమ్ము చోరీ

- పంచాయతీ కార్యదర్శిని బెదిరించి ఎత్తుకుపోయిన వైనం



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నవ్యశ్రీ

మాకవరపాలెం: పింఛన్ల పంపిణీ చేసేందుకు తీసుకెళ్తున్న రూ.16.15 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు.దుంగలవానిపాలెం జంక్షన్ సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని జడ్.గంగవరం పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీ శెట్టిపాలెం సచివాలయ ఇన్‌చార్జి వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల పంపిణీ చేయాల్సిన పింఛన్ల నగదును సాయంత్రం మాకవరపాలెంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసి ద్విచక్ర వాహనంపై శెట్టిపాలెం బయలుదేరారు. ఈ క్రమంలో దుంగలవానిపాలెం జంక్షన్ సమీపంలోకి వెళ్లేసరికి పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను బెదిరించారు. బైక్‌పై నుంచి ఆమెను పక్కకు నెట్టేసి రూ.16.15 లక్షలు ఎత్తుకుపోయినట్టు సచివాలయ సిబ్బందితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తి హెల్మెట్, మరొక వ్యక్తి ముఖానికి ముసుగు వేసుకుని ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రైం బ్రాంచ్ ఎస్‌ఐ రమేష్ విచారణ చేపట్టారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ

- పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



జి.మాడుగుల: కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, కష్టాల్లో ఉన్నప్పుడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆదుకుంటారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలో భీరం సెగ్మెంట్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యుడు కొటారి పెదబాలన్న గుండెపోటుతో 2022 జనవరి 9న, కొయ్యూరు మండలంలో వైఎస్సార్‌సీపీకి చెందిన బాలారం ఎంపీటీసీ శెట్టి రాంబాబు గతేడాది జనవరి మూడున మృతి చెందారు. ఈ రెండు కుటుంబాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.10లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించినట్టు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ ఎటువంటి సహాయం అందించిన దాఖలాలు లేవని ఆమె పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పడానికి సీఎం జగన్ ప్రకటించిన ఆర్థిక సాయమే నిదర్శనమని ఆమె అన్నారు. భీరం ఎంపీటీసీ పెద్దబాలన్న, బాలారం ఎంపీటీసీ శెట్టి రాంబాబు కుటుంబాలకు త్వరలోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఆర్థిక సాయం ఒకొక్క కుటుంబానికి రూ.10లక్షల చొప్పున అందజేస్తామని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు.

మద్యం మత్తులో కార్మికుడి హత్య

చింతపల్లి: గూడెంకొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ చాపరాతిపాలెంలో ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణ పనులు చేస్తున్న ఇద్దరి కార్మికుల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ తలెత్తింది. దీంతో ముఖేష్‌అనే కార్మికుడు సంతోష్ అటాష్‌ను గొడ్డలితో నరికి హత మార్చాడు. వీరు ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వచ్చి కొంతకాలంగా ఇక్కడ సెల్ టవర్ నిర్మాణ పనుల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో వివాదం తలెత్తడంతో ఆగ్రహానికి గురై ముఖేష్ ఈ హత్య చేశాడు. అనంతరం అతడు సెల్ టవరుపై ఎక్కి కిందకు దిగేందుకు మొండికేశాడు. తోటి కార్మికులు నచ్చజెప్పి కిందకు రప్పించి చితకబాదారు. సంఘటనపై జీకే వీధి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి దారుణ హత్య

- గొడ్డలితో నరికి, పెట్రోల్ పోసి నిప్పు
- సంఘటన స్థలంలోనే మృతి
- భూ తగాదాలే కారణమంటున్న బాధిత కుటుంబం

డుంబ్రిగుడ: మండలంలోని కితలంగి పంచాయతీ వయ్యా గ్రామంలో భూతగదా నేపథ్యంలో వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి అరకు సీఐ దేముడుబాబు, డుంబ్రిగుడ ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వయ్యా గ్రామానికి చెందిన గొల్లూరి గోవింద్ (45) పశువులను మేతకు తీసుకువెళ్లాడు. ఎండతీవ్రత కారణంగా చెట్టు కింద పడుకున్నాడు. అదే సమయంలో పింపోల్‌గుడ గ్రామానికి చెందిన గొల్లూరి లోకినాథ్, మరికొంతమంది అక్కడి వచ్చారు. గొడ్డలితో గోవింద్ మెడపై నరికారు. వెంటనే అతినిపై పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. గోవింద్ ఆర్తనాదాలు వినిన పరిసర ప్రాంతీయులు ఈవిషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు సంఘటన స్థలానికి వెళ్లేసరికి గోవింద్ చనిపోయాడు. వెంటనే కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు గోవింద్‌కు లోక్‌నాథ్ వరుసకు సోదరుడు. వీరిద్దరి పక్కపక్క గ్రామాలు. ఈ రెండు కుటుంబాల మధ్య భూతగాదాలు కొంతకాలంగా ఉన్నాయి. ఈ కారణంగా గొడ్డలితో నరికి హతమర్చారని మృతుని భార్య దొసుద, కుటుంబసభ్యులు ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

'స్పందన'కు 20 అర్జీలు

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్లో వివిధ శాఖల అధికారులతో కలిసి రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, రంపచోడవరం మొబైల్ మేజిస్ట్రేట్ జాన్‌రాజ్, ఏవో డీఎన్‌వీ రమణల స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సుమారు 20 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఏజెన్సీలోని గిరిజనుల నుంచి బినామీల పేరుమీద జరుగుతున్న భూముల కొనుగోలును అరికట్టాలని, ఏజెన్సీలో ఆక్రమణలు నివారించాలని పెదగెద్దాడ సర్పంచ్ వడగల ప్రసాద్ దరఖాస్తు అందజేశారు. వై.రామవరం మండలం మడుగు కోట గ్రామ సమీపంలోని కొత్త వీధికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని తంగుల ఉర్దూ, తంగుల బలరాంలు ఆర్జీ అందజేశారు. మధ్యలో నిలిపివేసిన దేవీపట్నం మండలం వెలగపల్లి జంక్షన్ – సీహెచ్ గంగవరం రోడ్డు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని పాముగడ్డి సర్పంచ్ కోసు బుచ్చన్న దొర, ఈక రాజన్న దొర దరఖాస్తు అందజేశారు. అడ్డతీగల మండలం రాయిపల్లి గ్రామంలో భూ సమస్య పరిష్కరించాలని లోత అచ్చయమ్మ దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఎస్‌డీసీ డి.ఎస్. శాస్త్రి, ఈఈ జి.డేవిడ్ రాజు, నాగేశ్వర రావు, ఎండి యూసఫ్ , జీసీసీ మేనేజర్ మురళి నాగరాజా రెడ్డి, డాక్టర్ గోపిక, డాక్టర్ రాధిక, ఏడీఏ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్'గా అక్రమాలు

- పరీక్షలు రాస్తూ పట్టుబడిన 27 మంది బయట వ్యక్తులు



ఓపెన్ పదో తరగతి పరీక్షల్లో పట్టుబడిన 27మంది బయట వ్యక్తులు

అరకులోయ రూరల్: స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఓపెన్ స్కూల్ 10వ తరగతి పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయి. పరీక్ష కేంద్రంలోని ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించింది. విద్యార్థుల స్థానంలో వేరే వ్యక్తులు పరీక్షలు రాస్తుండడాన్ని గమనించిన స్క్వాడ్ అధికారులు వారిని పట్టుకున్నారు. 27మంది పట్టుబడిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని స్క్వాడ్ అధికారి ప్రసాద్ తెలిపారు.

ఆటో ప్రమాదంలో అంగన్‌వాడీ ఆయా మృతి



ఆటో ప్రమాదంలో మృతి చెందిన గౌరమ్మ(ఫైల్)



ప్రమాదంలో నుజ్జయిన ఆటో

వీఆర్‌పురం : దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఆటో బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రం రేఖపల్లి శివారులో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివారల ప్రకారం పెద మట్టపల్లి పంచాయతీ గుర్రంపేట గ్రామానికి చెందిన చిచ్చడి గౌవరమ్మ (45) అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తుంది. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీరామగిరి గ్రామంలోని దొంగలదోపు ఉత్సవాన్ని వీక్షించేందుకు సోమవారం తెల్లవారు జామున అదే గ్రామానికి చెందిన బంధువు ఆటోలో వెళ్లారు. కాగా అక్కడ స్వామిని దర్శించుకొని ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో రేఖపల్లి గ్రామ శివారు గోడులమ్మ గుడి వద్దకు చేరుకునే సరికి ఆటో అదుపుతప్పి రోడ్డుకు పక్కగా ఉన్న తాడిచెట్టును బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ పక్కగా కూర్చున్న గౌరమ్మ తల భాగం చీలిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. అందులో ప్రయాణిస్తున్న మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. గౌరమ్మ భర్త సహదేవుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ టి.దుర్గాప్రసాద్ తెలిపారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్

రంపచోడవరం: రైతులు మేలైన జీడిమామిడి అంటు మొక్కలను నాటుకోవాలని పందిరిమామిడి ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర కె.రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కేవీకేలో డీసీసీబీ, కొచ్చి వారి ఆర్థిక సహకారంతో జీడిమామిడిలో మేలైన యాజమాన్య పద్ధతులపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జీడిమామిడి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,నీటి యాజమాన్యం గురించి తెలిపారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ఆదర్శ (కీటక విభాగం) మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కువగా వచ్చే తేయాకు దోమ, కాండం తొలుచు పురుగు, తామర పురుగు నివారణ మార్గాలను రైతులకు వివరించారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ లలితాకామేశ్వరి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో రైతులు ఎరువులు సరైన మోతాదులో వాడడం లేదన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎన్. చిరంజీవి,కె.వీరాంజనేయులు,ఆర్.ప్రవీణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులతో బలపడిన పోలీసుల మైత్రి

- సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్ మిశ్రా
- 200 మందికి దోమ తెరల పంపిణీ



గిరిజనులకు దోమ తెరలు పంపిణీ చేస్తున్న సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్ మిశ్రా

పెదబయలు: గిరిజనులతో సీఆర్‌పీఎఫ్ పోలీసుల మైత్రి బలపడిందని సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్ మిశ్రా తెలిపారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని రూడకోట పంచాయతీ కృష్ణాపురంలో సీఆర్‌పీఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో ముంచంగిపుట్టు ఎస్‌ఐ రవింద్ర చేతుల మీదుగా 200 మంది గిరిజనులకు దోమ తెరల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ ప్రతి ఏడాది గ్రామాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కోరారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్,మాజీ సర్పంచ్ పండా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల అనుచిత ప్రవర్తనపై విచారణ

తుమ్మపాల: అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులపై అధ్యాపకుల అనుచిత ప్రవర్తనపై వస్తున్న దుమారంపై కలెక్టర్ ఆదేశాలతో స్త్రీశిశు సంక్షేమ శాఖ సీడీపీవో ప్రభావతి సోమవారం విచారణ చేపట్టారు. కళాశాలలో విద్యార్థినులను, అధ్యాపకులను దాదాపు రెండు గంటలకు పైగా విచారణ చేశారు. మంగళవారం విచారణ చేపట్టి పూర్తి వివరాలతో నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు ఆమె తెలిపారు. ఇక్కడ ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక బృందాన్ని నియమించారు. విద్యార్థినుల పేర్లు బయట పడకుండా వారి నుంచి చిట్టీల రూపంలో సమాచారం సేకరిస్తున్నారు. ఈ సమాచారాన్ని కళాశాల ఆర్జేడీకి నివేదిస్తామని తెలిపారు.